www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 ఫిబ్రవరి 2024

5

పశ్చిమ గోదావరి

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులతో ఆదివారం సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకలు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తెన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

7లో 5 జనసేనకేనా..!

- టిడిపి, జనసేన నేతల్లో తీవ్ర చర్చ
- మిగిలిన ఏడు స్థానాల ఆశావహుల్లో టిక్కెట్ టెన్షన్
- టిడిపి సీనియర్ నేతలు చింతమనేని, గన్నికి తొలి జాబితాలో దక్కనిచోటు
- అసంతృప్తులు మరింత పెరిగే అవకాశం
- వైసిపి అభ్యర్థుల్లోనూ మార్పుకు అవకాశమంటూ ప్రచారం?

'ఐదు, పదేళ్ల నుంచి కష్టపడుతున్నాం. పార్టీ కోసం ఎంతో ఖర్చు చేశాం. నిరంతరం ప్రజల్లోనే ఉన్నాం.. తీరా ఎన్నికలొచ్చేసరికి టిక్కెట్ వస్తుందో లేదో పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదంటూ' టిడిపి, జనసేన నేతల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఇప్పటికే టిడిపి, జనసేన ప్రకటించిన తొలి జాబితాలో పలువురికి చోటు దక్కకపోవడం, ఇంకా ప్రకటించాల్సిన ఏడు స్థానాల్లో అత్యధికం జనసేనకు కేటాయించే అవకాశం ఉండడంతో ముఖ్యంగా టిడిపి నేతల్లో గుబులు రేపుతోంది. రెండో జాబితా ప్రకటన తర్వాత అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషణ కొనసాగుతోంది. వైసిపిలోనూ పలుచోట్ల అభ్యర్థులను మార్చే అవకాశం ఉందన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా ఏడు స్థానాలకు సంబంధించి ఉమ్మడి తొలి జాబితాను శనివారం ప్రకటించారు. ప్రకటించిన ఏడు స్థానాల్లో తణుకు, ఏలూరు, టిక్కెట్ ఆశించిన జనసేన నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనగా, ఉండి, నూజివీడు టిక్కెట్ ఆశించిన టిడిపి నేతల్లో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. ఇంకా ఏడు స్థానాలకు సంబంధించి అభ్యర్థులను టిడిపి, జనసేన ప్రకటించాల్సి ఉంది. తొలి జాబితాలో ప్రకటన చేసినా ఏడు స్థానాల్లో జనసేన అభ్యర్థులు ఒక్కరు కూడా లేరు. రెండో జాబితాలో ప్రకటించే ఏడు స్థానాల్లో ఐదుచోట్ల జనసేన అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని చెబుతున్న పరిస్థితి ఉంది. ఒకవేళ ఒకస్థానం బిజెపికి ఇచ్చి జనసేనకు మరోస్థానం తగ్గించినా రెండో జాబితాలో టిడిపికి మిగిలే స్థానాలు రెండుకంటే ఎక్కువగా ఉండవని టిడిపి, జనసేన నేతలు లెక్కలు కడుతున్నారు. దీంతో టిడిపి, జనసేన నేతల్లో టిక్కెట్ టెన్షన్ పట్టుకుంది. ముఖ్యంగా టిడిపిలో సీనియర్ నాయకులుగా ఉన్న గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్‌కు సైతం తొలిజాబితాలో చోటు దక్కలేదు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పోలవరం స్థానాలను జనసేనకు కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ బిజెపితో పొత్తు కుదిరితే కైకలూరు బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఉన్న గన్ని వీరాంజనేయులుకు ఉంగుటూరు టిక్కెట్ ఉంటుందా లేదా అన్న చర్చ కొనసాగుతోంది. దెందులూరు టిక్కెట్ చింతమనేనికి కేటాయిస్తారా లేక మార్పు ఉంటుందా అన్న అనుమానం సైతం నెలకొంది. దీంతో రెండో జాబితాపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీ కోసం నిరంతరం కష్టపడినా టిక్కెట్ కోసం నిరీక్షణ తప్పదడం లేదంటూ సీనియర్ నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తొలి జాబితా ప్రకటన తర్వాత ఏలూరు, తణుకులో టిక్కెట్ ఆశించిన జనసేన నేతలు రెడ్డి అప్పలనాయుడు, విడివాడ రామచంద్రరావు తీవ్ర ఆగ్రహంతో ఉండగా, ఉండి, నూజివీడులో టిడిపి ఆశావహ అభ్యర్థులు శివరామరాజు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మండిపడుతున్న పరిస్థితి నెలకొంది. రెండో జాబితా ప్రకటన తర్వాత అసంతృప్తి జ్వాలలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఉంగుటూరు టిక్కెట్ టిడిపికి కేటాయిస్తే జనసేన నేతకు, జనసేనకు కేటాయిస్తే టిడిపి నేతలో అసంతృప్తి కొనసాగనుంది. పోలవరం టిక్కెట్ జనసేనకు కేటాయిస్తే టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బొరగం శ్రీనివాస్ అలకబూనే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో టిక్కెట్ల కేటాయింపుల తర్వాత రాజకీయ పరిస్థితుల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

వైసిపిలోనూ అభ్యర్థుల మార్పునకు అవకాశమా?

ఇప్పటికే వైసిపి అన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించింది. వీరే అభ్యర్థులంటూ చెప్పకనే చెప్పేసింది. కానీ కొన్నిచోట్ల అభ్యర్థులు బలహీనంగా ఉన్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. టిడిపి, జనసేన అభ్యర్థుల ప్రకటన తర్వాత అసంతృప్తులను చేర్చుకుని కొన్నిస్థానాల్లో అభ్యర్థులను మార్పుచేసే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అసెంబ్లీ సీట్లకు సంబంధించి మరికొన్ని రోజులు ఉత్కంఠ కొనసాగనుందని చెప్పొచ్చు.

భీమవరం : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి రామ్ సుందర్ రెడ్డి

నరసాపురం: అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు

12,336 మంది అభ్యర్థులు హాజరు
2,210 మంది గైర్హాజరు
పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జెసి రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గ్రూప్ - 2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 14,546 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 12,336 మంది మాత్రమే పరీక్ష రాశారు. సుమారు 2210 మంది గైర్హాజరయ్యారు. గ్రూప్ - 2 పరీక్షల నిర్వహణకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ డివిజన్ల పరిధిలోని భీమవరంలో 21 పరీక్షా కేంద్రాలు, నరసాపురంలో 3, తాడేపల్లిగూడెంలో 13 కేంద్రాలు కలుపుకుని జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో గ్రూప్-2 పరీక్షలు రాశారు. చిన్నపాటి లోటుపాట్లు మినహా జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జెసి రామ్ సుందర్ రెడ్డి

జిల్లాలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. విష్ణు కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష నిర్వహణ తీరును తనిఖీ చేశారు. అభ్యర్థుల సంతకాల రిజిస్టర్లను పరిశీలించారు. పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని ఇన్విజిరేటర్లరకు సూచించారు. పరీక్షలు పూర్తయి పేపర్లు స్ట్రాంగు రూమ్‌కు చేరే వరకూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండాలన్నారు. ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరగకుండా పరీక్షలు విజయవంతమయ్యేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూంను పర్యవేక్షించిన ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివనారాయణ రెడ్డిని, పరీక్షల నిర్వహణలో తోడ్పాటును అందించిన ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారి జె.జయంతి, ఎఎస్ఒ ఎ.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి పిహెచ్ జిఆర్ పాపారావు, పర్యవేక్షకులు టిఎల్ఎస్-ఎస్.ప్రసాద్, సిబ్బంది జెసి ప్రత్యేకంగా అభినందించారు.

నరసాపురం : గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని శ్రీసూర్య డిగ్రీ జూనియర్ కళాశాల, వైన్, సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి వచ్చారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్, డిఎస్‌పి కె.రవి మనోహరాచారితో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. స్వర్ణాంధ్రలో మొత్తం వెయ్యి మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 750 హాజరయ్యారని, 250 మంది గైర్హాజరయ్యారని తహాశీల్దార్ ఎస్ఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. శ్రీసూర్యలో 300 మందికి 250 మంది హాజరయ్యారు. వైన్ కళాశాలలో 500 మందికి 413 మంది హాజరయ్యారు.

నరసాపుం: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ అంబరీష్

గ్రూప్-2 పరీక్షలో పేరుపాలెం బీచ్‌పై ప్రశ్న

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలో పేరుపాలెం బీచ్‌పై ప్రశ్న అడిగారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏకైక సముద్ర తీరప్రాంతం పేరుపాలెం. కార్తీకమాసంలో స్నానాలు చేసేందుకు లక్షల్లో పర్యాటకులు ఈ బీచ్‌కు వస్తారు. సెట్ -డిలో జాగ్రఫీ నుంచి 33వ ప్రశ్నలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రదేశాల్లో ఈ కింది వాటిని సరిపోల్చండి. అనే ప్రశ్నలో జాబితా-1లో పేరుపాలెం బీచ్ ఇచ్చారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా చుట్టు పక్కల ప్రాంతాల అభ్యర్థులు ఈ ప్రశ్న అడిగిన వెంటనే సులభంగా సమాధానం రాశామని తెలిపారు.

నేడు రైతు, కార్మిక నిరసన ప్రదర్శన

జయప్రదానికి సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

వ్యవసాయ రంగంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమావేశం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ మాట్లాడారు. ప్రపంచ వాణిజ్య సంస్థ దోహా నగరంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో వాణిజ్య సంస్థ ప్రతిపాదనలను నిరసిస్తూ రైతులు నిరసన ప్రదర్శన చేపట్టాలని కోరారు. వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఆహార భద్రత చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఈ ప్రతిపాదనలు సూచిస్తున్నాయన్నారు. రైతు కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీసం మద్దతు ధరలను రద్దు చేయాలని, వివిధ దేశాల ప్రభుత్వాలను డబ్ల్యూటిఒ ఆదేశిస్తుందని చెప్పారు. అలాంటి ఆదేశాన్ని భారతదేశం వంటి వ్యవసాయం మీద ఆధారపడిన దేశాలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రైతులపై బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తుంటే నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. మోడీ ప్రభుత్వం రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర నాయకులు దండు శ్రీనివాసరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి ఆంజనేయులు, రైతు నాయకులు చిర్ల పుల్లారెడ్డి, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్, కిలారి తవిటినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ హరేరామ్

'చలో విజయవాడ' వాయిదా దారుణం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా నిలబడి పోరాటం చేయాల్సిన ఎపిజెఎసి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే ఈ నెల 27వ తేదీ చలో విజయవాడ పిలుపును వాయిదా వేయడం అత్యంత దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి బకాయిల చెల్లింపుపై ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. సెప్టెంబర్ 2004 కంటే ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం పాత పెన్షన్ అమలు చేయకుండా దాటవేస్తున్నారన్నారు. పది వేల మంది కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని చెప్పినమాట నీటి మూటగా మారిపోయిందన్నారు. ఇలా ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను, ఉపాధ్యాయ సంఘాలను తప్పుదోవ పట్టిస్తున్నా ఉద్యమం చేయాల్సిన సమయంలో ఇలా అర్ధాంతరంగా ఉద్యమాన్ని వాయిదా వేయడాన్ని ఆయన ఖండించారు.

నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పోడూరు

కుటుంబం అంటే నేను, నా భార్య, నా పిల్లలు కాదని, పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని తరగతుల ప్రజలు కలిపి నా కుటుంబమని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో భాగంగా ఆదివారం 14వ రోజు మండలంలోని వేడంగి గ్రామంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌ఎగా రెండుసార్లు గెలిపించిన రుణం తీర్చుకునే విధంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవకునిగా పని చేశానని, మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత ఎక్కువగా పని చేస్తానని తెలిపారు. మొదటిసారి ఎంఎల్‌ఎగా నియోజకవ ర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలిపానని, రెండోసారి అధికారం లేకపోవడంతో ప్రజా పనుల్లో కొంత కష్టమైనా ప్రజలకు అండగా తోడుగా ఉన్నానన్నారు. రానున్న టిడిపి, జనసేన ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకొచ్చి ప్రజలకు అవసరమైన పనులు చేయించడంతోపాటు గతంలో మిగిలిన పనులను పూర్తి చేస్తానన్నారు. టిడిపి, జనసేన కలయికను అన్ని తరగతుల ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు.

కలయిక.. కలిసొచ్చేనా..!

- పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటనతో జనసేనలో జోష్
- నిస్తేజంలో టిడిపి.. ఆపై మరింత ముదిరిన గ్రూపుల పోరు
- మాజీ ఎంఎల్‌ఎ అంజిబాబుతో పవన్ ప్రత్యేక భేటీపై సర్వత్రా చర్చ
- జనసేన నుంచి పోటీకి సై అంటున్న అంజిబాబు!



ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటనలో నేతల ఆత్మీయ కలయిక ఆ పార్టీకి ఎంతవరకూ కలిసొస్తుందనే దానిపై విస్తృత చర్చలు సాగుతున్నాయి. జనసేనాని పర్యటనతో భీమవరం జనసేన జోష్‌లో ఉండగా టిడిపి మాత్రం తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతోంది. మాజీ ఎంఎల్‌ఎ అంజిబాబుతో పవన్ భేటీ వెనుక ఆంతర్యం ఏంటనే దానిపై పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఒకపక్క భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ, అవకాశం ఇస్తే జనసేన నుంచి తాను పోటీలో ఉంటానని అంజిబాబు ప్రకటించడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన నడుమ పొత్తు ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే చర్చ మొదలైంది.

భీమవరం రాష్ట్ర రాజకీయాలను దృష్టి మళ్లించిన అసెంబ్లీ స్థానం. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇక్కడ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. మళ్లీ ఇదే స్థానం నుంచి పోటీ చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పవన్ అధికారికంగా ప్రకటన చేయనప్పటికీ తాను ఇక్కడి నుంచి బరిలోకి దిగనున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భీమవరం రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గత ఎన్నికల్లో టిడిపి, జనసేన విడివిడిగా పోటీ చేశాయి. ఇప్పటికే టిడిపి, జనసేన పొత్తు ఏర్పాటు చేసుకొని ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన ఆ పార్టీకి మంచి మైలేజ్ తెచ్చి పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. పవన్ కూడా గత మాదిరిగా కాకుండా ఈ సారి ఎన్నికలకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇళ్లకు వెళ్లడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రధానంగా అంజిబాబుతో ప్రత్యేకంగా భేటీకావడం చర్చనీయాంశమైంది. దీంతో టిడిపిలో గతం నుంచి ఉన్న ముసలం మరింత ముదిరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన పొత్తు ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంశంపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

టిడిపిలో ముదిరిన గ్రూపుల పోరు

టిడిపి జిల్లా అధినాయకత్వం వ్యవహార శైలితో భీమవరం టిడిపిలో నెలకొన్న గ్రూపుల పోరు పవన్ పర్యటనతో మరింత ముదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇక్కడ టిడిపి రెండు గ్రూపులుగా చీలిపోయింది. భీమవరం పర్యటనకు వచ్చిన పవన్ టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి ఇంటికి వచ్చి భీమవరం నియోజకవర్గ టిడిపి నేతలు, కార్యకర్తలను కలుసుకోకుండా వెనుదిరగడంపై తెలుగు తమ్ముళ్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమను కలిసేందుకు కూడా రాలేని వ్యక్తితో తాము ఎలా ముందుకు సాగగలమని, ప్రజలే ఈ విషయాన్ని అడిగితే ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు సీతారామలక్ష్మితోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ టిడిపి శ్రేణులను సముదాయించినప్పటికీ వారు మాటకు మాట చెప్పడం చర్చనీయాంశమైంది.

అంజిబాబు ఆంతర్యం ఏమిటో..!

మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇంటికి స్వయంగా పవన్ కళ్యాణ్ వెళ్లి ఆత్మీయంగా కలుసుకోవడం చర్చనీయాంశమైంది. టిడిపి జిల్లా ముఖ్య నేతలు, ఇన్‌ఛార్జీలు, ఎంఎల్‌ఎలు అంతా టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఇంటి దగ్గర ఉంటే అంజిబాబు మాత్రం అక్కడకు రాలేదు. దీనికితోడు పవనే నేరుగా అంజిబాబు ఇంటికి వెళ్లడం రాజకీయ దుమారాన్ని రేపింది. అంజిబాబుతోపాటు ఆయన కుమారుడు కూడా పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తే గెలుపునకు అన్నివిధాలా కృషి చేస్తామని పవన్‌కు భరోసా ఇచ్చారు. ఇదిలాఉంటే ఒకవేళ పవన్ కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేయకపోతే తనకు అవకాశం ఇస్తే పోటీ చేస్తానని అంజిబాబు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. ఒకవైపు జనసేన నుంచి పోటీ చేస్తానని చెబుతూనే, నేను టిడిపిలో ఉన్నాను కాబట్టి అవకాశం వస్తే టిడిపి నుంచి కూడా పోటీ చేస్తానని చెబుతుండటంతో అసలు అంజిబాబు ఆంతర్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా పవన్ బరిలో లేకపోతే టిడిపి లేదా జనసేన నుంచి తాను బరిలో ఉంటానని అంజిబాబు చెప్పకనే చెబుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

పోటీపై స్పష్టత ఇవ్వకపోవడంపై అయోమయంలో కేడర్

టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించారు. జిల్లాలో ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాలకు అభ్యర్థులు ప్రకటించాల్సి ఉంది. అయితే నాలుగు స్థానాలను టిడిపికి కేటాయించడంతో మిగిలిన మూడు జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే భీమవరం నుంచి ఆది నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని చెబుతున్నప్పటికీ అభ్యర్థిగా ప్రకటించకపోవడం చర్చనీయాంశమైంది. నూరు శాతం పోటీ ఇక్కడ నుంచే ఉంటుందని భావించినప్పటికీ పోటీపై పవన్ స్పష్టత ఇవ్వకపోవడంతో జనసేన కేడర్ అయోమయంలో ఉంది. ఒకవేళ పవన్ పోటీ చేయకపోతే మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు జనసేన నుంచి పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం సాగుతోంది. భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా అంజిబాబుకే అప్పగిస్తారని ప్రచారం జోరందుకుంది. దీంతో ఉమ్మడి పొత్తు ఏ పార్టీకి కలిసొస్తుంది, ఏ అభ్యర్థి విజయానికి తోడ్పాటునిస్తుందన్నది తెలియాల్సి ఉంది.

ప్రజా క్షేత్రంలో ఉంటా

రానున్న ఎన్నికల్లో ఉండి నుంచే పోటీ చేస్తా
ఎంఎల్‌ఎ రామరాజుకు సహకరించే ప్రసక్తే లేదు
ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు

ప్రజాశక్తి - భీమవరం

రానున్న ఎన్నికలకు ప్రజాక్షేత్రంలో ఉంటానని, ఉండి ఎంఎల్‌ఎగా పోటీ చేస్తానని ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పదేళ్ల పాటు ఎంఎల్‌ఎగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కష్టపడటంతో పాటు పార్టీని నిలబెట్టిన తనను టిడిపి నమ్మించి మోసం చేసిందని, రానున్న ఎన్నికల్లో తన బలాన్ని చూపిస్తానని చెప్పారు. ఎన్నికల్లో ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు సహకరించే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. భీమవరంలో శివరామరాజు కార్యాలయంలో ఆయన ఆదివారం మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపి బలోపేతం కోసం కష్టపడితే తనను అవమానించారని, కనీస గౌరవం ఇవ్వకుండా పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఎంఎల్‌ఎ సీటును కేటాయిస్తానని చెప్పి కనీసం తనను సంప్రదించకుండా ఎంఎల్‌ఎ రామరాజుకు టికెట్ కేటాయించి అవమానపరిచారన్నారు. ఎంఎల్‌ఎ రామరాజు అవమానపరిచి ఇబ్బంది పెట్టినా పార్టీ కోసం భరించానని చెప్పారు. సీటు నాకు ఇవ్వకపోవడానికి కారణం అధిష్టానమే చెప్పాలన్నారు. తాను పార్టీ ఆదేశాలను పాటించే వ్యక్తినని, ఎంపీగా వెళ్లమంటే వెళ్లానని, ఇప్పుడు ఎంఎల్‌ఎ సీటు విషయంలో కనీస ధర్మం పాటించకపోవడం బాధాకరమన్నారు. మరో రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వెల్లడించారు.

నియోజకవర్గ పరిశీలికులపై తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

ఉండి నియోజకవర్గ టిడిపి పరిశీలికులు నాగేంద్ర కుమార్‌పై మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు గ్రూపునకు చెందిన తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో ఉన్న శివరామరాజు కార్యాలయానికి వచ్చిన నాగేంద్రకుమార్ శివరామరాజును బొజ్జగించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడే ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నాగేంద్ర కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శివరామరాజు నాగేంద్ర కుమార్‌ను ఇక్కడ నుంచి దయచేసి వెళ్లిపోవాలని చెప్పారు. ఈ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు శివరామరాజు జిందాబాద్ అంటూ నాగేంద్ర కుమార్ కార్యాలయం నుంచి వెళ్లిపోవాలంటూ కార్యాలయం బయట వరకు నినాదాలు చేశారు. దీంతో నియోజవర్గ పరిశీలకుడు నాగేంద్రకుమార్ అక్కడ నుంచి వెనుదిరిగారు.

ఎయిర్ వాల్ నుంచి వృథాగా పోతున్న నీరు

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపి.పాలెంనార్త్‌లో జంగిల్ ఛానల్ గట్టునున్న ఎయిర్ వాల్ నుంచి తాగునీరు లీకై వృథాగా పోతోంది. కెపి.పాలెం, కొత్తకాయలతిప్ప, మోడీ, ముత్యాలపల్లి గ్రామాల ప్రజలకు తాగునీరందించే పైప్‌లైన్‌కు జంగిల్ ఛానల్ వద్ద ఎయిర్ వాల్ ఏర్పాటు చేశారు. అయితే ఆ వాల్ మరమ్మతులకు గురై కొన్ని రోజులుగా శుద్ధి జలాలు వృథాగా పోతున్నాయి. అధికారులు నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్కులు అందిస్తున్న సతీష్‌రాజు, సందీప్‌వర్మ

అనారోగ్య బాధితులకు వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని జిన్నూరుపాలేనికి చెందిన పి.సాయికృష్ణ(25)కు షుగర్ వ్యాధి వల్ల రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ జరుగుతోంది. వసుధా ఫౌండేషన్ ద్వారా ఇతనికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. పోడూరుకు చెందిన అల్లూరి సూర్యవతి పక్షవాతం, గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు రూ.10 వేల చెక్కు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న యలమంచిలి మండలంలోని మేడపాడుకు చెందిన యాతంగిత సుమంగళికి రూ.10 వేలు అందించారు. నరసాపురం మండలంలోని మర్రితిప్పకు చెందిన ఎస్.సత్యవతికి పెరాలసిస్ వచ్చి కాలు, చేయి, మాట పడిపోయింది. ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. మొత్తం రూ.50 వేల చెక్కులను వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు పంపించగా ఆదివారం క్షత్రియ పరిషత్ హాలులో వైజాగ్ నుంచి వచ్చిన ప్రముఖ వైద్యులు ఇందుకూరి సతీష్ రాజు, డాక్టర్ ఎస్.సందీప్‌వర్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సతీష్ రాజు మాట్లాడుతూ పేదవారిని గుర్తించి ఆర్థిక సహాయం చేసిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజును ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. చెక్కుల అందుకున్న రోగులు వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్మత్స బుద్ధరాజు పాల్గొన్నారు.

విరాళాలిచ్చి ప్రజా ఉద్యమాలను బలపర్చాలి

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎంకు విరాళాలిచ్చి ప్రజా ఉద్యమాలను బలపరచాలని పట్టణంలో రాయిపేట, ఎన్‌టిఆర్ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఆ పార్టీ కార్యకర్తలు విరాళాలు సేకరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ మార్చి మొదటి వారంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నరసాపురం పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు. సిపిఎం నిత్యం ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు చేస్తుందన్నారు. ఆ పార్టీ ఉద్యమ, పోరాట అవసరాలకు విరాళాల సేకరణ చేస్తుందన్నారు. దేశంలో రాజకీయ పార్టీల్లో ఎలక్ట్రో బాండ్ పేరుతో కార్పొరేట్ శక్తుల నుంచి విరాళాలు తీసుకోని పార్టీ సిపిఎం అని చెప్పారు. ఈ దేశంలో మోడీ అవలంబిస్తున్న కార్పొరేట్ ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, నోములకొండ, బొడసింగు అప్పారావు, నారాయణరావు పాల్గొన్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

అధ్వానంగా రోడ్లు..!

రైతులు, గ్రామస్తుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలో పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో పట్టణం నుండి గ్రామాలకు నిత్యం వెళ్లే ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అగర్తిపాలెం నుండి ఆగర్రు మీదుగా రైతులు, ప్రజలు పాలకొల్లు వెళ్లి తమ పనులను ముగించుకుని వస్తుంటారు. రైతులు తమ పొలాలకు కావాల్సిన ఎరువులు, పొలం పనుల కోసం నిత్యం ఆ రహదారిలో రాత్రింబవళ్లు రైతులు తిరుగుతూ ఉంటారు. ఆ రహదారిలో సుమారు ఐదు అడుగుల లోతులో వెడల్పాటి పెద్ద గొయ్యి ఏర్పడింది. సుమారు రోడ్డు సగానికి విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందని అక్కడి రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - పోడూరు

లోకేష్ (ఫైల్‌ఫొటో)

మండలంలోని గుమ్మలూరు గ్రామానికి చెందిన కొన లోకేష్(25) ఆదివారం ఉదయం హైదరాబాద్ శివార్లలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కొన లోకేష్ శనివారం మధ్యాహ్నం మోటార్ సైకిల్‌పై తన సోదరి గృహ ప్రవేశ కార్యక్రమానికి హైదరాబాద్ బయలుదేరి వెళ్లాడు. కుటుంబసభ్యులందరూ తమతో పాటు రైలుపై రమ్మని చెప్పినా వినకుండా లోకేష్ బైక్‌పై హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి హైదరాబాద్ శివారులోకి వెళ్లేసరికి అతడిని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేరుపాలెం నార్త్‌లో అసంపూర్తిగా వియర్ ఛానల్

ఏటేటా పెరుగుతున్న అంచనాలు
ముందుకురాని గుత్తేదారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని మోడి, సముద్ర తీర ప్రాంతంలో పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లోని సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు చేపట్టిన వియర్ ఛానల్ నిర్మాణ పనులు రెండు దశాబ్దాలుగా పూర్తి కాలేదు. నిర్మాణం పూర్తి చేసేందుకు జల వనరుల శాఖాధికారులు రూపొందిస్తున్న అంచనాలు ఏటేటా పెరుగుతున్నాయి. గుత్తేదారులు ముందుకు రావడంలేదు.

2004లో ప్రారంభం

నరసాపురం కాలువ మొగల్తూరు పెదపల్లవపాలెం వద్ద ఉన్న దర్భరేవు డ్రెయిన్ వరకూ ప్రవహిస్తుంది. అక్కడి నుంచి పేరుపాలెంసౌత్‌లోని మొళ్లపర్రు వరకూ సాగునీటి కాలువ(వియర్ ఛానల్) నిర్మించేందుకు 2004లో అప్పటి టిడిపి ప్రభుత్వం సుమారు రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రధాన కాలువ, దానికి అనుసంధానంగా నాలుగు బ్రాంచి కాలువల నిర్మాణ పనులను గుత్తేదారులకు అప్పగించారు. గుత్తేదారులు కొంతమంది నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలివేశారు. అనంతరం అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలు వియర్ ఛానల్ నిర్మాణం పూర్తి చేసేందుకు ఆసక్తి చూపలేదు. అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా గుత్తేదారులు టెండర్లు దాఖలు చేయలేదు.

ఏడాదిగా ప్రారంభం కాని పనులు

సుమారు సంవత్సరం క్రితం ప్రభుత్వం రూ.21 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అసంపూర్తిగా ఉన్న మెయిన్ కాలువ, నాలుగు బ్రాంచి కాలువలు మొత్తం సుమారు 12 కిలోమీటర్ల వరకూ నిర్మించనున్నారు. గతేడాది నవంబరు 21న నరసాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వియర్ ఛానల్ నిర్మాణ పనులకు బటన్ నొక్కారు. ఆ పనులు ఇప్పటివరకూ ప్రారంభం కాలేదు.

స్పందించని గుత్తేదారులు

కాలువల నిర్మాణ బాధ్యతలను గుత్తేదారులకు అప్పగించేందుకు ప్రభుత్వం జల వనరుల శాఖ ద్వారా గతేడాది మూడు పర్యాయాలు టెండర్లు పిలిచారు. గుత్తేదారులు స్పందించలేదు. ఈ ఏడాది ఇప్పటివరకూ రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఆ పనులు చేస్తే నిధులు వస్తాయో..? రావోననే భయంతో గుత్తేదారులు టెండర్లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో వియర్ ఛానల్ పనులు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారింది.

మరో పర్యాయం టెండర్లు

బి.కృష్ణమోహన్, ఎఇ, జలవనరులశాఖ, నరసాపురం

ఇటీవల స్వల్ప కాల వ్యవధికి టెండర్లు పిలిచాం. గుత్తేదారులు స్పందించే అవకాశం ఉంది. టెండర్లు తెరిచేందుకు ఇంకా సమయం ఉంది. గుత్తేదారులు టెండర్ల పత్రాలు దాఖలు చేస్తే నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా వెంటనే ప్రారంభిస్తాం.

జనసేనకు తగిన సీట్లు కేటాయించలేదు

మాజీ మంత్రి హరిరామజోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో టిడిపి, జనసేన మధ్య పొత్తు అంగీకారం కుదిరినా పొత్తు ధర్మంలో భాగంగా జనసేనకు తగిన సీట్లు కేటాయించలేదని కాపుసేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య పవన్ కళ్యాణ్‌కు ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో జనసేనకు 24 ఎంఎల్ఎ, మూడు ఎంపీ సీట్లు కేటాయించడం తగదని తెలిపారు. రాష్ట్రంలో పొత్తు లేకుండానే జనసేన ఆ 24 సీట్లు గెలుచుకోలేదా అని జోగయ్య ప్రశ్నించారు. ప్రకటించిన 118 సీట్లలో కమ్మలకు 24, రెడ్లకు 17, కాపులకు 15, బిసిలకు 25 సీట్లు కేటాయించారని చెప్పారు. అయితే ఒప్పందం ప్రకారం బిసిలకు 50 శాతం, కాపులకు 25 శాతం కమ్మకు ఆరు శాతం, రెడ్లకు నాలుగు శాతం సీట్లు కేటాయించాల్సి ఉందని చెప్పారు. ఇరువురు గెలిస్తే మంత్రివర్గంలో జనసేన టిడిపిలు 50 శాతం చొప్పున మంత్రి పదవులు పంచుకుంటారా అని ప్రశ్నించారు. జన సైనికులు పవన్‌కళ్యాణ్‌ను కనీసం రెండున్నరేళ్ల సిఎంగా చూడాలని చూస్తున్నారని, దీనిపై చంద్రబాబు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

జీవన విద్యతోనే ఆలోచనలో మార్పు

ప్రజాశక్తి - తణుకు రూరల్

జీవన విద్య ప్రతి వ్యక్తిలో ఆలోచనలో ప్రవర్తనలో మార్పు తీసుకొస్తుందని శ్రీరామకృష్ణ సేవాసమితి కార్యదర్శి చిలుకూరి రామకృష్ణ అన్నారు. స్థానిక తణుకు శ్రీరామకృష్ణ సేవాసమితిలో జీవన విద్యా కార్యక్రమం సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ కాన్షియస్‌నెస్, వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజా వైద్యులు తాతిన రామబ్రహ్మం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామబ్రహ్మం మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు దైనందిన జీవితంలో మనతో మనం, కుటుంబంతో మనం, సమాజంతో మనం ఎలా ఉండాలో నేర్పుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్, ప్రొఫెసర్ ఎన్ఐటి వరంగల్ ఓరుగంటి హరికుమార్, ప్రొఫెసర్, ఎంవిఆర్ హైదరాబాద్ ఐవి నరసింహస్వామి, అక్కింశెట్టి రాంబాబు, డాక్టర్ అశోక్‌రెడ్డి, జయానంద్, గిరీశ్వరరావు, పుట్టా సత్యనారాయణ, గమిని రాంబాబు, గోపాల్ రెడ్డి, ఐఎంకెఎస్ రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి - ఇరగవరం

ఇరగవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా సంబంధిత అధికారులు మండలంలో ప్రస్తుతం అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, సహకార సంఘం అధ్యక్షులు, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్మలూరు పంచాయతీ పరిధిలోని రావిగొప్పు నుంచి రావిపాడు వెళ్లే ప్రధాన రహదారిని నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సిపిఎం రావిపాడు శాఖ సమావేశం గంగాజలం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గుమ్మలూరు నుంచి రావిపాడు, నేరేడుమెల్లి, మేడపాడు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిపై గుంతలు పడి రాళ్లు పైకిలేవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రహదారి నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి రాపాక వెంకటేశ్వరరావు, కేతా సత్యనారాయణ, మాస్కోడి మోహన్ పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల వెంకట రామరాజు పుట్టిన ఊరిని మరువకుండా కాళ్లకూరు గ్రామాభివృద్ధికి ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన ఉచిత ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను, వాటర్ ట్యాంకర్, వ్యాన్‌లను ఆదివారం ప్రారంభించారు. సుమారు 40 మంది పేదలకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులను అందించారు. ఇద్దరు వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు అందించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ కాళ్లకూరు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికీ వ్యాన్ ద్వారా టిన్లతో నీటిని సరఫరా చేయడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచి గాదిరాజు వెంకటసుబ్బరాజు, ఆలయ మాజీ ఛైర్మన్ వేగేశ్న సుబ్బరాజులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు), కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, వైసిపి నాయకులు అడ్డాల నాగరాజు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న పివిఎల్

నరసాపురంలో ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

నరసాపురంలో ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

ఎటువంటి మందులు, ఇంజక్షన్లు, ఆపరేషన్లు అవసరం లేకుండా రోగాలను తగ్గించడమే ఆక్యుపంక్చర్ వైద్య ముఖ్య లక్షణమని వైద్యులు కొండా శ్రీధర్ అన్నారు. నరసాపురం తొమ్మిదో వార్డు నందమూరి కాలనీ నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజరామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో ఆ వార్డు మాజీ కౌన్సిలర్ పెమ్మాడి వెంకట శ్రీదేవి కోరిక మేరకు ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరంలో శ్రీధర్ వైద్య సేవలందించి మాట్లాడారు. ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, పలు వ్యాధుల నివారణకు చిట్కాలు ఇచ్చి రోగులకు అవగాహన కల్పించారు. ప్రాచీన వైద్యం ఆక్యుపంక్చర్ వైద్య విధానానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. సర్వరోగ నివారిణి ఆక్యుపంక్చర్ అని అన్నారు. తన కుటుంబ సభ్యుడు కొవ్వలి రామ్మోహన్‌నాయుడు ఆర్థిక సాయంతో నరసాపురం పరిసర ప్రాంతాల ప్రజల కోరిక మేరకు గతేడాది నుంచి ప్రతి నెలా నిర్విరామంగా ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. నరసాపురం నియోజకవర్గంలోనే కాకుండా విశాఖపట్నం, బొబ్బిలి ప్రాంతాల్లో కూడా ఈ ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామన్నారు. మాజీ కౌన్సిలర్స్ పెమ్మాడి శ్రీదేవి మాట్లాడుతూ సమాజానికి కొవ్వలి ఫౌండేషన్ ద్వారా కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు, కొండా శ్రీధర్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సందక సురేష్, గునిశెట్టి రామకృష్ణ, పొన్నమండ మురళీ, వనమాల వెంకట్రావు, నండా రామకృష్ణ, గూడాల సునీత, బి.రాజేశ్వరి, సావిత్రి, నిమ్మకాయల బాబ్జీ, కామిరెడ్డి బాబు ఉన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

మెరిట్ విద్యార్థులకు రూ.12 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ

స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ప్రభు, ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పేదరికం నుంచి బయటపడే మార్గం ఒక్క విద్య ద్వారానే సాధ్యమని కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ వ్యవస్థాపకులు తులసి రామచంద్ర ప్రభు చెప్పారు. పాలకొల్లులో కాపు, తెలగ, బలిజ పేద మెరిట్ విద్యార్థులకు రూ.12 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆదివారం ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు బాగా చదువుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని కాపు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందిస్తున్న ఘనత ప్రభుదే అన్నారు. ఇప్పటివరకు ఆయన రూ.40 కోట్లకు పైగా సొంత సొమ్మును పేద విద్యార్థులకు అందించారన్నారు. నియోజకవర్గంలోని 360 మంది మెరిట్ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. స్కాలర్ షిప్‌లు తీసుకుంటున్న వారిలో ఆడపిల్లలే ఎక్కువని వారు చెప్పారు. సమాజంలో ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు విద్య ఎంతో దోహదపడుతుందని, ప్రతి కుటుంబం విద్యావంతులు కావాలని మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య చెప్పారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, లయన్స్ జోన్ ఛైర్మన్ కొమ్ముల మురళీకృష్ణలను ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, వంగా నరసింహరావు సారధ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, ముచ్చర్ల శ్రీరామ్, చవాకుల నరేష్‌బాబు, యర్రంశెట్టి వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

పాలకొల్లు : శిబిరంలో వైద్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో క్షత్రియ కళ్యాణ మండపంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 600 మందికి పైగా రోగులు వివిధ వైద్యనిపుణుల వద్ద ఉచితంగా చికిత్స చేయించుకున్నారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఐ.సతీష్‌రాజు, న్యూరో సర్జరీ నిపుణులు సతీష్, కార్డియాలజీ నిపుణులు జగన్నాథరాజు, యూరాలజీ నిపుణులు జి.రవీంద్రవర్మ, ప్రముఖ గైనకాలజిస్ట్ పల్లవి, క్యాన్సర్ నిపుణులు హేమంత్ వర్మ, యూరాలజీ నిపుణులు సందీప్ వర్మ, కంటి వైద్య నిపుణులు చైతన్య రోగులను పరీక్షించారు. క్షత్రియ సేవా సంఘం, హైదరాబాద్, అల్లూరి సీతారామరాజు సేవాసమితి శిబిరం నిర్వహణకు సహకరించింది. శిబిరం నిర్వహణకు పరిషత్ అధ్యక్షులు జగన్నాథరాజు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ కృషి చేశారు.

300 మందికి ఉచిత గుండె పరీక్షలు

నరసాపురం :నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్ నిపుణుల బృందం వారితో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం, డాక్టర్ రవిరాజు ఉచిత దంత వైద్యశాల శిబిరం మున్సిపల్‌హై స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ సభ్యులు ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, ట్రెజరర్ బొమ్మిడి సూర్యకుమారి, క్లబ్ మేజర్ డోనర్ కోట్ల రామకుమార్, అందే వెంకటకృష్ణ, కనకం వరప్రసాద్, అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాస్, బాబు విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో 300 పైగా మందికి ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు.

నరసాపురం : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మంతెన రామరాజుకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజుకు 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఉండి సీటు కేటాయించడంతో పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలోని మండల నాయకులు రామరాజుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో కష్టపడి ఉండి నియోజకవర్గంలో మంతెన రామరాజును గెలిపించుకుని మరోసారి తెలుగుదేశం కంచుకోట ఉండిలో టిడిపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంతెన రామరాజుకు నాయకులు ముదునూరి కృష్ణంరాజు, మంతెన సాయిరాజు, కాగిత బుజ్జి, బండారు వీరరాఘవులు, గంధం బుజ్జి, కర్రి శ్రీనివాస్, పోలుబోతు రాము, సారేపల్లి త్రిమూర్తులు అభినందనలు తెలిపారు.

భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువత ఆలోచించాలని, సినిమా వ్యామోహం నుంచి కుల అభిమానం నుంచి బయటకు రావాలని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన సుమారు వందమంది యువకులు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గ అభివృద్ధి కోసం యువత వైసిపిలో చేరడం సంతోషకరమని అన్నారు.భీమవరం పట్టణానికి సంబంధించి 2054 వరకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని తాగునీటికి ఇబ్బంది లేకుండా పైపులైన్లను వేస్తున్నట్లు చెప్పారు. భీమవరం, వీరవాసరం మండలాల్లో ఉన్న అన్ని గ్రామాలకు ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు, అవసరమైన చోట ఒహెచ్ఆర్‌లను నిర్మించేందుకు జలజీవన్ మిషన్ పథకంలో రూ.60 కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో యువత కూడా భాగస్వామ్యం అవుతున్నందుకు తనకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎఎస్.రాజు, వన్‌టౌన్ జెసిఎస్ కన్వీనర్ నల్ల రాంబాబు, గాదిరాజు రామరాజు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముమ్మరంగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆచంట

మార్చి ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు ఆచంట శ్రీ రామేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించనున్న శివరాత్రి ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లలో నిమఘ్నమయ్యారు. ఆచంట కోడేరు రహదారి వెంబడి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆలయం ఆవరణ ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆచంట కచేరి సెంటర్ నుంచి ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రహదారి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేస్తున్నారు. శివరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించడానికి మండలంలోని పలు ఆలయాల్లో ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు సన్నాహాలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు నిమఘ్నమయ్యారు.

ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఆచంటలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట గ్రామంలో ఉన్న శ్రీదేవి శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయం ఆవరణలో ఏకాదశి ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి రామచంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆచంట మండల యాత్రికులు వందలాదిగా తరలివచ్చి స్వామివారి ప్రసాదం స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.